క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల సందర్శన



వీరులపాడు:మండలంలోని పెద్దాపురం, జుజ్జూరు, అల్లూరు, వీరులపాడుతోపాటు పలు గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు సందర్శించారు. ఓటర్లను పలకరించడంతోపాటు పోలింగ్ సరళిని పరిశీలించారు. ఈసందర్భంగా డాక్టర్ జగన్ మోహనరావు మాట్లాడుతూ ఓటర్లంతా ప్రశాంత వాతావరణంలో ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. ఆయన వెంట ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, పీఏసీఎస్ చైర్మన్ పూలా రాంబాబు, వైస్‌ఎంపీపీ నాగుల్ మీరా, నాయకులు పాల్గొన్నారు.

పోలింగ్ సరళి పరిశీలన



కంచికచర్ల: కంచికచర్ల మండలంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండలంలోని ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు సందర్శించారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సరళిని పరిశీలించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.రవీంద్రరావు మండలంలోని కంచికచర్ల సత్రం బడి, విజయరాణి ఉన్నత పాఠశాల, జెడ్పీ ఉన్నత పాఠశాల, పరిటాల జెడ్పీ ఉన్నత పాఠశాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పోలింగ్ జరుగుతున్న విధానాన్ని పరిశీలించారు. కంచికచర్ల సత్రం బడి, మండలంలోని పెండ్యాలలో పోలింగ్ కేంద్రాల వద్ద రాత్రి 11 గంటల వరకు పోలింగ్ కొనసాగిందని తహశీల్దార్ వి.సుస్వాగతం తెలిపారు.

భారీగా తరలివచ్చిన ఓటర్లు



వత్సవాయి: చెదురుమదరు ఘటనలు మినహా వత్సవాయి మండలంలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. గ్రామాల్లో ఓటర్లు భారీగా తరలివచ్చి తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. మక్కపేటలోని మూడు పోలింగ్ కేంద్రాలు, దబ్బాకుపల్లిలోని మూడు పోలింగ్ కేంద్రాలు, పోచవరం, కంభంపాడు, వేమవరం, గోపినేనిపాలెం, వత్సవాయిల్లో ఈవీఎం మొరాయించడంతో పోలింగ్ గంటపాటు నిలిచిపోయింది. వృద్ధులు, వికలాంగుల కోసం ప్రత్యేకంగా వాహనాలను ఏర్పాటు చేయడంతో వారు కూడా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటుహక్కు వినియోగించుకున్నారు.

ఓటర్లకు ధన్యవాదాలు




జగ్గయ్యపేటఅర్బన్, నందిగామటౌన్: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో పాల్గొని ఓటేసిన ఓటర్లందరికీ జగ్గయ్యపేట, నందిగామ ఎమ్మెల్యేలు సామినేని ఉదయభాను, డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు సోమవారం రాత్రి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగంగా ఓటర్లంతా పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్లలో గంటల కొద్దీ వేచి ఉండి ఓటుహక్కును వినియోగించుకోవడం గొప్పవిషయమని కొనియాడారు. ఓటర్లందరికీ వారు తమ కృతజ్ఞతలు తెలియజేశారు.

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతం

- ఓటర్లలో వెల్లువెత్తిన చైతన్యం
- పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం ఆరున్నర గంటలకే భారీ క్యూలైన్లు
- కొన్నిచోట్ల రాత్రి 11గంటల వరకు కొనసాగిన పోలింగ్
- నందిగామ, జగ్గయ్యపేటల్లో 86.50శాతం నమోదు
- పోలింగ్ శాతం పెరిగే అవకాశం
- గంటల తరబడిన వేచి ఉండి ఓటేసిన ప్రజలు



నందిగామ మండలం ఐతవరంలో ఓటేసేందుకు బారులు తీరిన మహిళలు



కంచికచర్ల మండలం పరిటాలలో ఓటేసేందుకు బారులు తీరిన ప్రజలు



జుజ్జూరులో ఓటువేసినట్లు వేలిపై ఉన్న సిరా గుర్తును చూపిస్తున్న దివ్యాంగుడు

జగ్గయ్యపేట, నందిగామ: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఓటేసేందుకు జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గ ప్రజలు సోమవారం ఉదయం ఆరున్నర గంటల నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద క్యూ కట్టారు. ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఆరుగంటల వరకు పోలింగ్ జరుగగా, ఆరుగంటలలోపు క్యూలైన్‌లో ఉన్నవారందరికి ఆయా పోలింగ్ కేంద్రాల ఎన్నికల సిబ్బంది ఓటు వేసే అవకాశం కల్పించారు. వేసవి కావడంతో అధికశాతం మంది ఓటర్లు ఉదయం పూటే ఓటేసేందుకు ఆసక్తిచూపారు.దీంతో ఉదయం ఏడుగంటలకే పోలింగ్ కేంద్రాల వద్ద భారీ క్యూలైన్లు దర్శనమిచ్చాయి. ఓటుహక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలనే చైతన్యం ఓటర్లలో రావడంతో చాంతాడంత క్యూలు ఉన్నప్పటికీ రెండు, మూడు గంటలపాటు క్యూలో నిలబడి మరీ ఓటుహక్కు వినియోగించుకున్నారు. వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు సైతం ఉదయమే పోలింగ్ కేంద్రాలకు తరలిరావడం గమనార్హం. జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని జగ్గయ్యపేట పట్టణం, జగ్గయ్యపేట మండలం, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాలు, నందిగామ పరిధిలోని నందిగామ పట్టణం, నందిగామ మండలం, కంచికచర్ల, వీరులపాడు, చందర్లపాడు మండలాల్లోని ఆయా గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి కనిపించింది.

పోటెత్తిన ఓటర్లు..

సార్వత్రిక ఎన్నికల్లో ఓటేసేందుకు ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలో ఉదయం 9గంటలకు శాతం పోలింగ్ నమోదుకాగా నందిగామలో 4.5శాతం పోలింగ్ నమోదైంది. 11గంటలకు జగ్గయ్యపేటలో 17.45శాతం, నందిగామలో 20.55శాతం, మధాహ్నం ఒంటిగంటకు జగ్గయ్యపేటలో 44.70శాతం, నందిగామలో 36.19శాతం, మధ్యాహ్నం 3గంటలకు జగ్గయ్యపేటలో 63.10శాతం, నందిగామలో 59.15శాతం, సాయంత్రం ఐదుగంటలకు జగ్గయ్యపేటలో 76.72శాతం, నందిగామలో 70.18శాతం. సాయంత్రం 6గంటలకు జగ్గయ్యపేటలో 78.20శాతం, నందిగామలో 72.72శాతం పోలింగ్ నమోదైంది.

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్ ..

నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో ఒకటి రెండు చెదురుముదురు సంఘటనలు తప్పా, పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఓటర్లు తమ ఓటుహక్కును ఎంతో బాధ్యతగా, సక్రమంగా వినియోగించుకున్నారు. ఓటర్లకు ఇబ్బంది లేకుండా అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన మౌలికవసతులు కల్పించారు. టెంట్లు ఏర్పాటు చేయడంతోపాటు మంచినీటి వసతి కల్పించారు. వృద్ధుల కోసం వీల్‌చైర్లు ఏర్పాటుచేశారు. వికలాంగుల కోసం మెట్లకు ప్రత్యామ్నాయంగా రెయిలింగ్ ఏర్పాటు చేశారు.

మొరాయించిన ఈవీఎంలు..

జగ్గయ్యపేట నియోజకవర్గంలోని షేర్‌మహ్మద్‌పేట, మెట్లగూడెం పోలింగ్‌కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించడంతో రెండుగంటల పాటు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. నందిగామ మండలంలోని ఏటిపట్టు గ్రామమైన రామిరెడ్డిపల్లి పోలింగ్ కేంద్రంలోనూ ఈవీఎం కొద్దిసేపు మొరాయించింది. నందిగామ నియోజకవర్గంలోని కంచికచర్ల సత్రం బడి పోలింగ్ కేంద్రంలో ఈవీఎం సరిగా పనిచేయకపోవడంతో అరగంటపాటు పోలింగ్ నిలిచిపోయింది.

పోలింగ్ సిబ్బందికి సూచనలు..

షేర్ మహ్మద్‌పేట పోలింగ్ కేంద్రాన్ని జగ్గయ్యపేట, నందిగామ, మైలవరం అసెంబ్లీ నియోజకవర్గాల పరిశీలకులు నరేందర్‌సింగ్ బాలి పరిశీలించారు. పోలింగ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. జగ్గయ్యపేట పట్టణంలోని ఆర్‌సీఎం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, దుర్గాపురం, బండిపాలెం, అనిగండ్లపాడు, డబ్బాకుపల్లి, ముచ్చింతాల, మక్కపేటతోపాటు నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో రాత్రి పదిగంటల వరకు పోలింగ్ కొనసాగింది. షేర్‌మహ్మద్‌పేట, వేదాద్రి, చిల్లకల్లు, గండ్రాయి గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద టెంట్‌లు వేయకపోవడంతో ఎండవేడిమి తట్టుకోలేక ఓటర్లు అల్లాడిపోయారు. పెనుగంచిప్రోలు మండలం ముళ్ళపాడు గ్రామానికి చెందిన 92ఏళ్ల వృద్ధురాలు మండ్లపాటి వరలక్ష్మి తన కుటుంబసభ్యుల సహకారంతో ఓటేశారు. గరికపాడులో 90ఏళ్ల వృద్ధుడు గన్నారపు కోటిరెడ్డి తన ఓటుహక్కును వినియోగించుకునేందుకు కుటుంబసభ్యులు ఆయన్ను మంచంతోనే పోలింగ్ కేంద్రానికి తీసుకువచ్చారు.

స్వల్ప లాఠీచార్జీ

జగ్గయ్యపేట మండలంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగినా అక్కడక్కడ చదురుమదురు సంఘటనలు చోటుచేసుకున్నాయి. అనుమంచిపల్లిలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ ఓటర్లపై స్వల్ప లాఠీచార్జి చేశారు. అదేవిధంగా జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో హింసాత్మక ఘటనలు జరగకుండా కెమెరాల నిఘాలో పోలింగ్ నిర్వహించారు. వెబ్ కాస్టింగ్ ద్వారా ఎన్నికల సిబ్బంది పర్యవేక్షించారు.

ఓటేసిన ప్రముఖులు

నందిగామటౌన్, జగ్గయ్యపేట అర్బన్: ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట ఎమ్మెల్యే అభ్యర్థి సామినేని ఉదయభాను, తన సతీమణి విమలాభానుతో కలిసి జగ్గయ్యపేట పట్టణంలోని మిట్టగూడెంలో ఓటుహక్కును వినియోగించుకున్నారు. నందిగామ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు చందర్లపాడులో ఓటేశారు. ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్ తన సతీమణి శశికళతో కలిసి నందిగామలో ఓటుహక్కును వినియోగించుకున్నారు. నందిగామలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తంగిరాల సౌమ్య, జగ్గయ్యపేటలో టీడీపీ అభ్యర్థి శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), వత్సవాయి మండలం కన్నెవీడులో కాంగ్రెస్ అభ్యర్థి కర్నాటి అప్పారావు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. జగ్గయ్యపేటలో మాజీమంత్రి నెట్టెం రఘురాం ఓటేశారు. నెడ్‌క్యాప్ చైర్మన్ వేల్పుల రవికుమార్, మున్సిపల్ చైర్మన్లు రంగాపురం రాఘవేంద్ర, ఓర్సు లక్ష్మి, ఆయా మండలాల ఎంపీపీలు మార్కపూడి గాంధీ, కొలుసు రమాదేవి, అకుల హనుమంతరావు(రంగా), షేక్ మలక్ బషీర్, కోటేరు లక్ష్మి, గుడేటి నాగమల్లేశ్వరి, జెడ్పీటీసీలు దేవమణి శ్రీనివాస్, వూట్ల నాగమణి, గాదెల వెంకటేశ్వరరావు, వేల్పుల ప్రశాంతి, అమర్లపూడి కీర్తిసౌజన్య, ముక్కపాటి నరసింహారావు, మార్కెట్‌యార్డు చైర్మన్లు మానేపల్లి బ్రహ్మం, షేక్ మస్తాన్, కోటేరు మల్లీశ్వరి, ఆయా కార్పొరేషన్ల డైరెక్టర్లు షేక్ గౌస్‌బాషా, బొమ్మిశెట్టి భాస్కరరావు, షహనాజ్‌బేగం, చేని కుమారి, బత్తుల రామారావు, శ్రీతిరుపతమ్మ అమ్మవారు, తిరుమలగిరి దేవస్థానాల చైర్మన్లు జంగాల శ్రీనివాసరావు, కొమరగిరి రవీంద్ర భరద్వాజ్ ఆయా పోలింగ్ కేంద్రాల్లో తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.



నందిగామలో ఓటుహక్కు వినియోగించుకున్న ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్ దంపతులు




ఓటు వేసిన జగ్గయ్యపేట, నందిగామ టీడీపీ అభ్యర్థులు శ్రీరాం తాతయ్య, తంగిరాల సౌమ్య




జగ్గయ్యపేటలో ఓటేసిన మాజీమంత్రి నెట్టెం రఘురాం, మున్సిపల్‌చైర్మన్ ఆర్. రాఘవేంద్ర



నందిగామ మండలం అంబారుపేటలో క్యూలైన్‌లో నిల్చున్న మహిళా ఓటర్లు



పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడులో బారులు తీరిన ఓటర్లు



ఐతవరంలో క్యూలైన్‌లో నిల్చులేక కూర్చున్న వృద్ధులు, మహిళా ఓటర్లు



జగ్గయ్యపేట మండలం బండిపాలెంలో ఓటేసేందుకు బారులు తీరిన ఓటర్లు



వీరులపాడు మండలం జుజ్జూరులో ఓటేసేందుకు క్యూలెన్‌లో నిల్చున్న ఓటర్లు

రాత్రి పదిగంటల వరకు పోలింగ్

పెనుగంచిప్రోలు: చెదురుముదురు సంఘటనలు మినహా సార్వత్రిక ఎన్నికల పోలింగ్ పెనుగ్రంచిపోలు మండలంలోని 47పోలింగ్ కేంద్రాల్లో సోమవారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం ఏడుగంటలకు పోలింగ్ ప్రారంభం కాగా, ఓటర్లు అంతకుముందు నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. మహిళలు, వృద్ధులు, యువత, దివ్యాంగులు భారీసంఖ్యలో తరలివచ్చి తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. సాయంత్రం ఆరుగంటల ల్లోగా పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్‌లో నిల్చున్న వారికి ఎన్నికల సిబ్బంది ఓటువేసే అవకాశం కల్పించారు. దీంతో ఆయా గ్రామాల్లో రాత్రి పదిగంటల వరకు పోలింగ్ కొనసాగగా, 88శాతం వరకు పోలింగ్ నమోదైంది. నవాబుపేట తదితర గ్రామాల్లో ఓటరు ఐడీ ఉన్నా ఆధార్ కావాలని అధికారులు చెప్పడంతో ఓటర్లు క్యూలైన్ నుంచి వెళ్లి తిరిగి రావాల్సి వస్తోంది. అనిగండ్లపాడు 162వ నంబరు పోలింగ్ కేంద్రంలో ఈవీఎం ఉదయం పూట ఓ గంట, మధ్యాహ్నం రెండు గంటలపాటు మొరాయించడంతో ఓటర్లు ఇబ్బందులుపడ్డారు. మరమ్మతుల అనంతరం తిరిగి ఈవీఎంలు పనిచేయడం ప్రారంభించడంతో పోలింగ్ కొనసాగింది. ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ నిలిచిపోయి క్యూలైన్లలో ఓటర్ల సంఖ్య భారీగా పెరిగిపోయింది. దీంతో ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద కొద్దిసేపు గందరగోళ పరిస్థితి నెలకొంది.

టీడీపీ నాయకుల రాద్ధాంతం..

శివాపురం గ్రామంలో ఓటు విషయంలో టీడీపీ నాయకులు చేసిన రాద్ధాంతంపై ఘర్షణ వాతావరణం నెలకొని రాళ్ల దాడికి దారి తీసింది. కొళ్లికూళ్లలో కూడా పోలీసులు అనవసరంగా వైఎస్సార్ సీపీకి చెందిన వ్యక్తిని అనవసరంగా కొట్టారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పెనుగంచిప్రోలు యూపీ స్కూల్, ముచ్చింతాల యూపీ స్కూల్ వద్ద టీడీపీ నాయకులు కవ్వింపుల చర్యలకు ప్పాలడటంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. సమయానికి పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపుచేశారు.

నవాబుపేటలో గ్రామస్తుల ఆందోళన..

మండలంలోని నవాబుపేట ఆర్‌సీఎం పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్‌కేంద్రంలో పోలీసులు టీడీపీకి అనుకూలంగా పనిచేస్తున్నారంటూ గ్రామస్తులు తీవ్రఆందోళన వ్యక్తం చేశారు. క్యూలైన్ల వద్ద టీడీపీకి చెందిన వారు క్యూలైన్ల వద్ద హల్‌చల్ చేస్తున్నా పట్టించుకోని పోలీసులు వైఎస్సార్‌సీపీ వారిని మాత్రం పోలింగ్ కేంద్రం వద్దకు కూడా రానివ్వడం లేదని గ్రామస్తులు చెప్పారు. విధుల్లో భాగంగా వచ్చిన సీహెచ్ శ్రీనివాస్ తమను తీవ్రంగా ఇబ్బంది పెట్టారని వారు ఆరోపించారు. అలాగే పోలింగ్ కేంద్రంలో ఓ అధికారిణి కూడా ఓట్లు వేసే విషయంతో టీడీపీ వారికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఓటర్లు ఆరోపించారు. అధికారులు ఇలా ఒక పార్టీకి కొమ్ముకాయడం దారుణమన్నారు. అనిగండ్లపాడులోని 162 పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులు ఎటువంటి కారణం లేకుండా సీహెచ్ నవీన్ అనే దివ్యాంగుడిని కొట్టారని అతని కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు అధికారులు టీడీపీ తొత్తులుగా పనిచేశారని గ్రామస్తులు ఆరోపించారు.



నవాబుపేట ఆర్‌సీఎం పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు



నవాబుపేటలో ఓటు వేసేందుకు వస్తున్న వృద్ధురాలు



అనిగండ్లపాడులో పోలీసుల సమక్షంలోనే కవ్వింపుచర్యలకు పాల్పడుతున్న టీడీపీ నాయకులు



అనిగండ్లపాడులో ఓటేసేందుకు క్యూలైన్లలో భారీసంఖ్యలో వేచి ఉన్న ఓటర్లు

స్ట్రాంగ్ రూంకు ఈవీఎంలు



నందిగామ: నందిగామ నియోజకవర్గంలో ఎన్నికల పోలింగ్ సోమవారం రాత్రి పొద్దుపోయే వరకు కొనసాగింది. నందిగామలోని జెడ్పీ పాఠశాల, మండలంలోని అడవిరావులపాడు, మునగచర్లలో ఈవీఎంలు కొద్దిసేపు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యమైంది. నందిగామ మండలం పెద్దవరం, చందర్లపాడు మండలం కొడవటికల్లు, వీరులపాడు మండలం గూడెం మాధవరం, కంచికచర్లలోని సత్రం బడి పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 11గంటల వరకు పోలింగ్ కొనసాగింది. పోలింగ్ అనంతరం ఆయా పోలింగ్‌కేంద్రాల నుంచి ఈవీఎంలను పటిష్ట బందోబస్తు నడుమ నందిగామలోని స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించారు.

రద్దీగా జాతీయ రహదారి



నందిగామ: రాష్ట్రంలో ఎన్నికల పోలింగ్ సందర్భంగా స్వగ్రామంలో ఓటుహక్కు వినియోగించుకున్న వారు తిరిగి హైదరాబాద్‌తోపాటు ఆయా ప్రాంతాలకు సోమవారం రాత్రి తిరుగుపయనయ్యారు. తరలివెళ్తున్న వారి వాహనాలతో రాత్రి 11 గంటల నుంచి దాదాపు మంగళవారం తెల్లవారుజాము వరకు 65వ నంబర్ జాతీయ రహదారి రద్దీగా కనిపించింది.

ఎన్నికల చిత్రాలు



నందిగామ మండలం ఐతవరంలో ఓటేసేందుకు వృద్ధుడిని తీసుకువస్తున్న గ్రామస్తులు



పేటలో వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్‌ను పర్యవేక్షిస్తున్న అధికారులు



పోలింగ్ సిబ్బందితో మాట్లాడుతున ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



చందర్లపాడు మండలం కోనాయపాలెంలో క్యూలైన్‌లో ఓటర్లు



పోలింగ్ కేంద్రం వద్ద క్యూలైన్‌లో నిలుచున్న ఓటర్లు



కె.అగ్రహారంలో ఓటేసిన వృద్ధురాలు